క్లుప్తంగా

ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షుడిగా మురళి



మంగళగిరి: ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మండలంలోని చినకాకానికి చెందిన ఆర్యవైశ్య సంఘం నాయకుడు నేరెళ్ల మురళి నియమితులయ్యారు. ఈ మేరకు చెన్నైలోని ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ ప్రధాన కార్యాలయం మంగళవారం ప్రకటన విడుదల చేసింది. ఆర్యవైశ్య ప్రపంచ మహాసభ అధ్యక్షుడు తుంగుటూరి రామకృష్ణ ఈ మేరకు నియామక ఉత్తర్వులు అందజేసినట్లు రాష్ట్ర అధ్యక్షుడు దేవతి భగవన్నారాయణ తెలిపారు. ఈ సందర్భంగా మురళిని మహాసభ కన్వీనర్ ఎల్లూరి లక్ష్మయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎల్లూరి సుధాకర్‌తో పాటు ఆర్యవైశ్య మహాసభల ప్రతినిధులు అభినందించారు.

డీఎస్సీ ర్యాంకర్ షేక్ సాహిన్ కౌసర్‌కి సన్మానం



దుగ్గిరాల: డీఎస్సీ ఫలితాల్లో దుగ్గిరాలకు చెందిన షేక్ సాహిన్ కౌసర్ సత్తా చాటారు. 2018లో అర మార్కుతో ఉద్యోగం కోల్పోయినా నిరాశ పడకుండా, పట్టుదలగా చదివారు. 2025 డీఎస్సీ ఫలితాల్లో తెలుగులో 37వ ర్యాంకు, ఉర్దూలో 9వ ర్యాంకు సాధించారు. ఈ సందర్భంగా విజయవాడలోని ఎస్ఎస్ కన్వెన్షన్ హాలులో బుధవారం ఎస్.ఎస్. పబ్లికేషన్ డైరెక్టర్ శేషావలి, సిబ్బంది ఆమెను సన్మానించారు.

తాగునీటిలో బ్యాక్టీరియా లేదు

దుగ్గిరాల: మండలంలోని పలు గ్రామాల్లో సేకరించిన నీటిలో కలుషితాలు గానీ, బ్యాక్టీరియా గానీ లేవని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వేణుగోపాలస్వామి బుధవారం తెలిపారు. గత నెల 20వ తారీఖున మండలంలోని పలు గ్రామ పంచాయతీల నుంచి 21 శాంపిల్స్ సేకరించి గుంటూరు మెడికల్ కళాశాల, జిల్లా పంచాయతీ ల్యాబ్, తెనాలి గ్రామీణ నీటి శాఖ ల్యాబ్‌లకు పంపించినట్లు పేర్కొన్నారు. భూగర్భ జలాలు, ఆర్వో ప్లాంట్ల నుంచి తీసిన నీరు సురక్షితంగా ఉన్నాయని పేర్కొన్నారు. కలెక్టరుకు నివేదిక అందించామని, ప్రజల మంచినీటిని వడపోసి కాచిన నీటిని తాగటం ద్వారా జ్వరాలు, ఇతర సీజనల్ వ్యాధులకు దూరంగా ఉండవచ్చని ఆయన సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ నెహ్రూ, వెలుగు ఏపీఎం సురేష్, ఈఓ వివేకానంద పాల్గొన్నారు.

విజయకీలాద్రిపై కనుల పండువగా ఉత్సవాలు



తాడేపల్లి రూరల్ : తాడేపల్లి పట్టణ పరిధిలోని సీతానగరం విజయకీలాద్రి దివ్యక్షేత్రంపై నిర్వహిస్తున్న శరన్నవరాత్రి ఉత్సవాలు బుధవారంతో తొమ్మిదవ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ మేనేజర్ పురాణం వెంకటాచార్యులు మాట్లాడుతూ శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్‌స్వామి మంగళా శాసనాలతో తొమ్మిదవ రోజు కార్యక్రమంలో భాగంగా శ్రీ లక్ష్మీనారాయణ పెరుమాళ్లకు ఉదయం 9 గంటలకు తిరుమంజనం అలంకరణ, భక్తుల సామూహిక కుంకుమార్చన కార్యక్రమాలు ఘనంగా నిర్వహించామని తెలిపారు. సాయంత్రం 6 గంటలకు పెరుమాళ్లకు పల్లకీ సేవ, అర్చనలు నిర్వహించామని పేర్కొన్నారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని, పూజల్లో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారని తెలిపారు. ఉత్తరాషాఢ నక్షత్రం సందర్భంగా శ్రీ భూ వరాహస్వామికి అభిషేకం, అనంతరం భూ వరాహ హోమం అంగరంగ వైభవంగా నిర్వహించినట్లు పేర్కొన్నారు.

పంటల సంరక్షణకు చర్యలు తీసుకోవాలి

ఫిరంగిపురం: ప్రస్తుత వర్షాకాలంలో పంటల సంరక్షణకు రైతులు చర్యలు తీసుకోవాలని ఏవో వాసంతి తెలిపారు. మండలంలోని 113 తాళ్లూరులో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో వాసంతి మాట్లాడుతూ ఉరకెత్తిన పత్తి, మిరప పంటలపై ఎకరానికి 30 కిలోల యూరియాతో పాటు 15కిలోల పొటాష్‌ను చల్లుకోవాలని సూచించారు.వాటితో పాటు 19,19,19తో పొటాషియం నైట్రేట్ వంటి నీటిలో కలిపే ఎరువులను వారం రోజుల వ్యవధిలో ఒకదాని తరువాత ఒకటి పిచికారీ చేయించాలని చెప్పారు. పత్తి పైరులో గులాబీ రంగు కాయ తొలుచు పురుగును గమనించినట్లయితే ఎకరానికి ఆరు నుంచి పది వరకు లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. అనంతరం ట్రాక్టర్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి షేక్ సుభాని, కిరణ్, రైతులు పాల్గొన్నారు.

సంఘ వ్యతిరేక శక్తులపై నిఘా పెంచాలి

జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్



స్టేషన్‌లో ఉన్న ద్విచక్ర వాహనాల వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ జిందాల్

మంగళగిరి /మంగళగిరి టౌన్: సంఘ వ్యతిరేక శక్తులపై నిరంతరం నిఘాతో పాటు చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు ఎవరు పాల్పడ్డా ఉపేక్షించవద్దని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ స్థానిక పోలీసు అధికారులకు సూచించారు. ఆయన బుధవారం మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని (ఎంటీఎంసీ) మంగళగిరి పట్టణ, రూరల్ స్టేషన్లను ఆకస్మికంగా సందర్శించారు. రికార్డులను పరిశీలించి అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ భూ కబ్జాలు, సెటిల్మెంట్లు, గంజాయి రవాణా వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై నిరంతరం నిఘా ఏర్పాటు చేయడంతో పాటు ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. ఎంటీఎంసీ పరిధిలోని గంజాయి సరఫరా, ట్రాఫిక్ సమస్యలను ప్రధానంగా గుర్తించామని, వాటిని నివారించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతూ ప్రజలను ఇబ్బందులకు గురిచేసే వారిపై నిఘా ఉంచి, చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. ముఖ్యంగా రోడ్డు ప్రమాదాల నివారణపై దృష్టి సారిస్తామని, మద్యం తాగి, నిబంధనలను ఉల్లంఘించి వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. స్టేషన్లలో సిబ్బంది కొరతను నివారిస్తామని, మరిన్ని నియామకాలు చేపడతామని తెలిపారు. పోలీసులు కూడా ప్రజలకు దగ్గరగా ఉంటూ స్నేహభావంతో మెలగాలని ఆయన సూచించారు. ప్రజలకు న్యాయం జరిగేలా ఫిర్యాదులను తక్షణం విచారించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో నార్త్ జోన్ డీఎస్పీ మురళీకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుతో వ్యవసాయ రంగానికి ఊతం



దుగ్గిరాలలో ట్రాక్టర్లతో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

దుగ్గిరాల: వ్యవసాయ రంగానికి చెందిన ఉపకరణాలు, ట్రాక్టర్లు, పాల ఉత్పత్తులు, రసాయన ఎరువులు ధరలు తగ్గాయని జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ ముత్యాలరావు తెలిపారు. దుగ్గిరాలలోని రైలుపేటలో బుధవారం అధికారులు ట్రాక్టర్లు, వ్యవసాయ పరికరాలతో ర్యాలీ నిర్వహించారు. జీఎస్టీ తగ్గింపుపై పూర్తి వివరాలతో కూడిన సమాచారాన్ని కరపత్రం రూపంలో ముద్రించి గ్రామస్తులకు ఏఓ ఆర్. విజయబాబు అందజేశారు. వినియోగదారుడా మేలుకో... జీఎస్టీ ఫలాలు అందుకో అంటూ సిబ్బంది నినాదాలు చేశారు. ముత్యాలరావు మాట్లాడుతూ గతంలో జీఎస్టీ 5, 12, 18, 28 శాతాలుగా ఉండేదని, ఇందులో 12, 28 శాతం ఉన్న వాటిని పూర్తిగా తొలగించారని తెలిపారు. దీనివల్ల ఆహారాల ధరలు తగ్గాయని వివరించారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ ఏడీ అన్నపూర్ణ, డెప్యూటీ కమిషనర్ శ్రీనివాసరావు, సుధాకర్, గోపి, రైతులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుతో ప్రజలకు మేలు

ఫిరంగిపురం: కేంద్ర ప్రభుత్వం పన్ను రహిత సేవలు అందేందుకు కృషి చేస్తున్నట్లు డ్వామా పీడీ శంకర్ అన్నారు. మండలంలోని వేములూరిపాడులో బుధవారం జీఎస్టీ తగ్గింపుపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ రోజు వారి ఉపయోగించే అనేక వస్తువులపై జీఎస్టీ సున్నా లేదా ఐదు శాతం ఉండేలా ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు తెలిపారు. దీని ద్వారా ప్రతి వినియోగదారుడుకు మేలు జరుగుతుందని, వేల రూపాయిలు లబ్ధి పొందే అవకాశం ఉందని చెప్పారు. జీఎస్టీ తగ్గింపుపై ప్రజలంతా అవగాహన పెంచుకోవాలని ఆయన సూచించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఇంచార్జి ఎంపీడీవో కె.రవిబాబు, ఈవోపీఆర్డీ వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి జ్యోత్స్న, పంచాయతీ, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ సీపీ కార్యాలయం ప్రారంభోత్సవం

తాడికొండ: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కార్యాలయాన్ని గురువారం ఉదయం 10 గంటలకు ప్రారంభించనున్నట్లు అధ్యక్షుడు వంగా పోలారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పరిశీలకులు మోదుగుల వేణుగోపాలరెడ్డి, నియోజకవర్గ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు, పార్లమెంటు పరిశీలకులు పోతిన మహేష్ హాజరు కానున్నారని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని ముఖ్య నాయకులు, కార్యకర్తలు, భారీగా హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎలుపునిచ్చారు.

నారా లోకేష్ ఇచ్చిన హామీని నెరవేర్చాలి

తాడేపల్లి రూరల్: ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీకార్మికులకు మంత్రి నారా లోకేష్ ఇచ్చిన హామీని నెరవేర్చాలని యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్ డిమాండ్ చేశారు. తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో కార్మికులు నిర్వహిస్తున్న దీక్షలు బుధవారం నాటికి 302వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా స్టీవెన్ మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఈ ప్రాంతంలో పర్యటించినపుడు నారా లోకేష్ తమ పార్టీ అధికారంలోకి వస్తే కార్మికుల సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ఇప్పుడు ఆయన మంత్రి కూడా అయ్యారని, ఇచ్చిన హామీని నెరవేర్చాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కార్మికులు పాల్గొన్నారు.

నేడు మాంసాహార విక్రయాలపై నిషేధం

మంగళగిరి టౌన్ : మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో గాంధీ జయంతి సందర్భంగా గురువారం మాంసం, చేపల విక్రయాలను పూర్తిగా నిషేధిస్తున్నట్లు కమిషనర్ అలీమ్‌బాషా తెలిపారు. తన కార్యాలయంలో బుధవారం మాట్లాడుతూ అక్టోబర్ 2 గురువారం గాంధీ జయంతి సందర్భంగా మాంసం, చేపల దుకాణాలు, హోటళ్లు, రెస్టారెంట్ల సహా అన్ని వాణిజ్య సంస్థల్లో ఈ నిషేధం వర్తిస్తుందని పేర్కొన్నారు.

కార్యకర్తలకు అండగా డిజిటల్ బుక్

మేడికొండూరు : కూటమి ప్రభుత్వ అధికారంలో దౌర్జన్యాలు, అక్రమ అరెస్టులు పరాకాష్టకు చేరాయని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తాళ్లూరు వంశీకృష్ణ అన్నారు. మేడికొండూరు మండల పరిధిలోని పేరేచర్ల సెంటర్‌లో బుధవారం డిజిటల్ బుక్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ కక్ష సాధింపుల నేపథ్యంలో కార్యకర్తలకు అండగా ఉండేందుకు పార్టీ అధినేత వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి డిజిటల్ బుక్‌ను, క్యూఆర్ కోడ్‌ను ప్రవేశపెట్టారని తెలిపారు. డిజిటల్ బుక్‌లో స్కానర్‌ను ఎక్కడైనా పార్టీ శ్రేణులకు అన్యాయం జరిగితే వెంటనే కోడ్ స్కాన్ చేసి వివరాలు నమోదు చేయవచ్చని ఆయన సూచించారు. కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ రబ్బాని, షేక్ సుభాని, కొరప్రాడు ఎంపీటీసీ సభ్యుడు మల్లిపెద్ది లక్ష్మీనారాయణ, ముత్యాల బాలస్వామి, గండికోట రసూల్, కోక అర్జున్‌రావు, ఆవుల రమణారెడ్డి , రాఘవరావు, కొరివి కిశోర్, కొరివి చెన్నయ్య, ఉడత శ్రీనివాసరావు, కోటి అబ్బాస్, గోపిదేశి శ్రీను, పేరం సాయి, దొప్పలపూడి దయాకర్, సుబ్బారావు, విజయ్‌చందర్, రవి కిశోర్‌రెడ్డి, షేక్ జిలాని, లూర్దు రాజు, షేక్ బుడే, షేక్ అబ్దుల్లా, షేక్ షరీఫ్ పాల్గొన్నారు.

డోర్ టు డోర్ సర్వేపై సచివాలయ ఉద్యోగుల పోరు

మేడికొండూరు: తమ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా ఇంటింటి సర్వే విధులను అప్పగించడాన్ని నిరసిస్తూ గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగులు రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమబాట పట్టారు. ఏపీవీడబ్ల్యూఏఎస్ రాష్ట్ర కార్యవర్గ పిలుపు మేరకు మేడికొండూరు మండల సచివాలయ ఉద్యోగులు బుధవారం మధ్యాహ్నం ఎంపీడీవోకు వినతి పత్రం సమర్పించారు. పెన్షన్ పంపిణీ పూర్తయిన వెంటనే, తమ నిరసనలో భాగంగా అధికారిక వాట్సాప్ గ్రూపుల నుంచి విరమించుకోవాలని ఉద్యోగులు నిర్ణయం తీసుకున్నారు. ఇంటింటి సర్వే బాధ్యతలను పూర్తిగా తొలగించేంత వరకు, తమ న్యాయమైన డిమాండ్స్‌పై అధికారిక ప్రకటన వచ్చే వరకు ఈ నిరసన కొనసాగుతుందని స్పష్టం చేశారు. అయితే, ఉద్యోగులు ప్రతిరోజూ ఉదయం 10 నుండి సాయంత్రం 5 గంటల వరకు కార్యాలయంలో అందుబాటులో ఉంటారని వారు తెలిపారు. తమ డిమాండ్లను తక్షణమే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని వారు ఎంపీడీవోను కోరారు.

గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలి

తాడేపల్లి రూరల్ : ఇటీవల కురుస్తున్న భారీ వర్షాల కారణంగా తాడేపల్లిలోని కొన్ని ప్రాంతాల్లో వర్షపు నీరు, మురుగునీరు నిలిచిపోయి ప్రజలు అనారోగ్యాల పాలవుతున్నారని, అటువంటి ప్రాంతాల్లో మెడికల్ క్యాంపులు నిర్వహించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. తాడేపల్లి పట్టణ పరిధిలోని మేకా అమరారెడ్డి భవన్‌లో బుధవారం సీపీఎం శాఖ కార్యదర్శులు, పట్టణ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు.ముఖ్య అతిథిగా పాల్గొన్న బూరుగ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ యుద్ధ ప్రాతిపదికన ఆయా ప్రాంతాల్లో డ్రైనేజీ వ్యవస్థను మెరుగు పరచాలని ఎంటీఎంసీ అధికారులకు విజ్ఞప్తి చేశారు.

టీడీపీ కార్యకర్తల బాహాబాహి

మేడికొండూరు: తెలుగుదేశం పార్టీ (టీడీపీ) కార్యకర్తలు రెండు వర్గాలుగా విడిపోయి ఘర్షణకు దిగిన ఘటన మేడికొండూరులో బుధవారం జరిగింది. ఫ్లెక్సీ విషయంలో చెలరేగిన వివాదం కాస్తా ముదిరి ఇరువర్గాలు పార్టీ ఆఫీస్ ముందు కొట్టుకున్నారు. అక్కడే ఉన్న సీనియర్ నాయకులు జోక్యం చేసుకుని, ఇరు వర్గాల వారిని మందలించి పంపారు. ఘర్షణ జరుగుతున్న సమయంలో పోలీసులు లేకపోవడంపై శాసనసభ్యులు తెనాలి శ్రవణ్ కుమార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శాంతిభద్రతలను కాపాడడంలో పోలీసులు నిర్లక్ష్యం వహించారని ఆయన మండిపడినట్లు తెలుస్తోంది.

భూములు లాక్కుంటే సహించేది లేదు

నిడుముక్కల(తాడికొండ): అదనపు పూలింగ్ పేరుతో ప్రభుత్వం రాజధాని ప్రాంత రైతుల భూములను లాక్కుంటే సహించేది లేదని ఏఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు జంజనం కోటేశ్వరరావు అన్నారు. రెండో దశ పూలింగ్ పేరుతో భూ సమీకరణకు ప్రభుత్వం అడుగులు వేస్తుండటాన్ని నిరసిస్తూ తాడికొండ మండలం నిడుముక్కలలో కొనసాగుతున్న రిలే నిరసన దీక్షలు బుధవారంతో 94 రోజులకు చేరాయి.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల తరతరాల భూములను లాక్కొని ప్రభుత్వం రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయాలనుకోవడం సిగ్గుచేటని ఖండించారు. పూలింగ్ ప్రక్రియ ఉపసంహరించుకొనే వరకు తమ పోరాటం ఆపేది లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పలువురు రైతులు, మహిళలు పాల్గొన్నారు.

దుష్ట సంహారిణి... మహిషాసుర మర్దని పాహిమాం !

దుష్ట సంహరిణి .. మహిషాసురమర్దని అంటూ అమ్మవారిని భక్తులు వేడుకున్నారు. దసరా పర్వదినాన్ని పురస్కరించుకొని అమ్మవారి ఆలయాలలో దేవీ శరన్నవరాత్రుల ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. మంగళగిరి, తాడికొండ నియోజకవర్గాల్లోని దేవీ ఆలయాలన్నీ పదవ రోజైన బుధవారం అమ్మవారిని మహిషాసుర మర్దనిగా అలంకరించి పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

– దుగ్గిరాల/ ఫిరంగిపురం/ తాడేపల్లి రూరల్/మంగళగిరి/ మంగళగిరి టౌన్



దుగ్గిరాల కంఠంరాజుకొండూరులోని మహంకాళీ దేవస్థానంలో ..



పాత మంగళగిరి కనకదుర్గా ఆలయయంలో ..



పెదవడ్లపూడిలో ప్రత్యేక అలంకారంలో అమ్మవారు



ఫిరంగిపురంలోని విజయదుర్గా ఆలయంలో...



మంగళగిరి నరసింహస్వామి ఆలయంలో చెంచులక్ష్మిగా..

పెన్షన్లు పంపిణీ చేసిన కలెక్టర్



మంగళగిరి టౌన్ : నగర పరిధిలోని టిడ్కో గృహ సముదాయంలో బుధవారం నిర్వహించిన పెన్షన్ల పంపిణీలో జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న ఎన్‌టీఆర్ భరోసా పెన్షన్లను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బుధవారం అందుకోని వారికి 3వ తేదీ శుక్రవారం అందజేస్తారని తెలిపారు. అనంతరం స్థానికులతో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. టిడ్కో గృహవాసులు మాట్లాడుతూ మౌలిక సదుపాయాల కొరత ఉందని, మురుగునీరు రహదారులపై నిలిచిపోతోందని తెలిపారు. కుక్కల బెడద ఎక్కువగా ఉందని, చిన్నపాటి వర్షానికే టిడ్కో ప్రాంతమంతా నీట మునిగి నివాసాల్లోకి నీరు చేరుతోందని విజ్ఞప్తి చేశారు. స్పందించిన కలెక్టర్ ఆయా సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.